క్లుప్తంగా

హనుమాన్ చాలీసా పారాయణ



హనుమాన్ చాలీసా పారాయణ చేస్తున్న మహిళా భక్త బృందం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక లక్ష్మీవారపు పేట శ్రీమహాలక్ష్మి అమ్మవారి సంబర మహోత్సవాన్ని మంగళవారం అంగరంగ వైభవంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారపు పేట శ్రీ షిర్డీ సాయి ప్రేమ మందిరం ఆలయ మహిళ భక్తులచే హనుమాన్ చాలిసా భక్తి సంకీర్తనలు ఆలపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని, గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. తీర్థ, ప్రసాదాలను స్వీకరించారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. భక్తులు అమ్మవారి అన్న ప్రసాదం స్వీకరించారు.

కుక్కల బెడదపై ఫిర్యాదు



కమిషనర్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): నగరంలో స్వైర విహారం చేస్తున్న వీధి కుక్కలను అరికట్టాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం కమిషనర్ ఎ.భాను ప్రతాప్‌కు వినతి పత్రం అందజేశారు. కుక్కల వల్ల విద్యార్థులు, మహిళలు, వాహన చోదకులు భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికే చాలామంది కుక్కల దాడిలో గాయాలపాలైనట్టు చెప్పారు. ఇప్పటికే చాలా కుక్కలను పట్టుకున్నారని, మిగతా వాటిని త్వరలోనే పట్టుకుని ఇబ్బంది లేకుండా చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ప్రతాప్ సుబ్రహ్మణ్య శర్మ, కేఎస్ఎన్ మూర్తి, సుంకర సుబ్బారావు పాల్గొన్నారు.

నేటి నుంచి జాలిపూడి అమ్మవార్ల జాతర



గంగానమ్మ

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం జాలిపూడి గ్రామంలో గంగానమ్మ, పోతురాజు, ఆది మహాలక్ష్మి, వినుకొండ అంకమ్మ వార్ల జాతర మహోత్సవాలు బుధవారం ప్రారంభించనున్నట్టు జాలిపూడి గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్, మాజీ సర్పంచ్ దాసరి నాగమల్లేశ్వరి తెలిపారు. ఈ ఉత్సవాలను ఉదయం 11.12 గంటలకు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రారంభిస్తారని, 11.19 గంటలకు అమ్మవారికి ముడుపు కట్టు, రాత్రి 10.8 గంటలకు మేళతాళాలతో గ్రామ పొలిమేరలు ఆనకట్టు కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. భక్తులంతా జాతరకు హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆమె కోరారు.

పోణంగిలో అగ్నిప్రమాదం



దగ్ధమవుతున్న గడ్డివాము

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం పోణంగిలో మంగళవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించింది. మెరుగుమాల రాజేంద్రప్రసాద్‌కు చెందిన 15 ఎకరాల గడ్డివాము దగ్ధమైంది. ఏలూరు ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. ఈ ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

చిక్కుముడులు వీడేదెన్నడో!

- విద్యుత్ స్తంభాలకు భారీగా కేబుల్ వైర్లు
- పొంచి ఉన్న ప్రమాదం
- స్తంభం ఎక్కేందుకు లైన్‌మన్లకు ఇబ్బందులు




వైర్ల తుట్టలతో విద్యుత్ స్తంభం



స్తంభం ఎక్కడం సాధ్యమేనా?



స్తంభానికి ఉన్న కేబుల్ వైర్లు



స్తంభం ఎక్కేందుకు వీలు లేకుండా ఉన్న వైర్లు



విద్యుత్ స్తంభాన్ని కమ్మేసిన వైర్లు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలో విద్యుత్ స్తంభాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. దాదాపు ప్రతి స్తంభానికీ కేబుల్ వైర్లు పెద్దపెద్ద చుట్టలుగా చుట్టి దర్శనమిస్తున్నాయి. వేసవిలో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ఒక్కోసారి స్తంభాలపై షార్ట్ సర్క్యూట్ కారణంగా విద్యుత్ లైన్లు కాలిపోతుంటాయి. ఆ మంటలు స్తంభాలకు చుట్టిన వైర్లకు వ్యాపించే ప్రమాదం నెలకొంది. కొన్ని సందర్భాల్లో తీగలు తెగి వాటికున్న రబ్బరు ముక్కలు కాలి కరిగి పడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. స్తంభాలకున్న కేబుల్ వైర్లను తొలగించాలని ఎన్నిసార్లు కోరినా అధికారుల నుంచి స్పందన ఉండడం లేదని వారు ఆందోళన చెందుతున్నారు.

అనుమతులపై అనుమానాలు

గతంలో ఒకటో రెండో కేబుల్ నెట్‌వర్క్‌లు ఉండేవి. నేడు కేబుల్ నెట్‌వర్క్‌లతో పాటు ఇంటర్నెట్ నెట్‌వర్క్‌లు పుట్టగొడుగుల్లా పుట్టుకురావడంతో సంబంధిత కేబుళ్లను విద్యుత్ స్తంభాలకే చుడుతున్నారు. వీటిలో అనుమతులున్నవి ఎన్నో ? లేనివి ఎన్నో విద్యుత్ అధికారులకే తెలియని పరిస్థితి ఉంది. విద్యుత్ స్తంభాలకు కేబుల్ వైర్లు చుట్టడానికి కొన్ని సంస్థలు రాష్ట్ర వ్యాప్తంగా ఒకే చోట అనుమతులు తీసుకుని, రుసుము కూడా రాష్ట్ర స్థాయిలో చెల్లిస్తున్నట్టు చెబుతున్నారు. అయితే చాలా నెట్‌వర్క్‌లు అనుమతి లేకుండానే విద్యుత్ స్తంభాలకు వైర్లను చుట్టేస్తున్నారు. రాష్ట్ర స్థాయిలోనే అనుమతులు పొంది ఉంటారనే భావనతో అధికారులు మిన్నకుండిపోతున్నట్టు సమాచారం.

ప్రధాన కూడళ్లలో సమస్య

విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే ఆయా ప్రాంతాల్లో లైన్‌మన్లు స్తంభాలు ఎక్కి సమస్యను పరిష్కరిస్తారు. ఐతే కేబుల్ వైర్లు చుట్టిన స్తంభాలు ఎక్కేందుకు లైన్‌మన్లకు ఇబ్బందులు తప్పడంలేదు. ఈ పరిస్థితి ఎక్కువగా నగరంలోని ప్రధాన వ్యాపార కూడళ్లుగా ఉన్న మెయిన్ బజారు, రామచంద్రరావు పేట, తంగెళ్లమూడి, నరసింహారావు పేట, శనగపప్పు బజారులతో పాటు శాంతి నగర్, సత్రంపాడు, అలాగే అపార్ట్‌మెంట్లు ఉన్న ప్రాంతాల్లో కనిపిస్తోంది. కేబుల్‌వైర్లు చుట్టి ఉండడంతో స్తంభం పైకి ఎక్కడం కుదరడంలేదని లైన్‌మన్లు గోలచేస్తున్నారు. కనీసం నిచ్చెన వేసుకుందామన్నా వైర్లతో వీలులేని పరిస్థితి ఉంది. కేబుల్‌వైర్లే కాదు కొన్ని ప్రాంతాల్లో పిచ్చిమొక్కల తీగలు సైతం విద్యుత్ లైన్లపై పాకుతున్నాయి. వాటి ద్వారా విద్యుత్ ఎర్త్ అవుతూ కింద ఉన్న స్తంభాలను తాకితే షాక్ తగులుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. వీటిపై సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

స్పందించని అధికారులు



మా ప్రాంతంలో విద్యుత్ స్తంభాలకు వివిధ కేబుల్ నెట్‌వర్క్ వైర్లు అధికంగా కట్టి ఉంటున్నాయి. కేబుల్ వైర్లు స్తంభాలను ఆసరాగా చేసుకుని కొనసాగిస్తే పరవాలేదు. ఒకే స్తంభానికి వైర్లు కట్టలుకట్టలుగా చుట్టి అక్కడే కట్టివేయడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందో అనే భయమేస్తోంది. ఫిర్యాదులు చేస్తున్నా స్పందన ఉండడం లేదు.

– మంతెన భాస్కర్, స్థానికుడు

చర్యలు తీసుకుంటాం

విద్యుత్ స్తంభాలకు కేబుల్ వైర్లు కట్టడం రాష్ట్ర వ్యాప్త విధానంగా అమలవుతోంది. అనుమతిలేని కేబుళ్లు స్తంభాలకు పెట్టినట్టు మా దృష్టికి రాలేదు. సమస్య వచ్చినప్పుడు స్తంభానికి అడ్డుగా ఉన్న కేబుల్ వైర్లను తొలగించాలని ఆపరేటర్లకు ముందుగానే సమాచారం ఇస్తున్నాం. వారు తొలగించకపోతే మేమే వాటిని తొలగిస్తున్నాం.

– టి.రాజకుమార్, ఈపీడీసీఎల్ ఏలూరు టౌన్ ఏడీఈ

17న సీఆర్ఆర్‌లో క్యాంపస్ సెలక్షన్స్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సీఆర్‌రెడ్డి పీజీ కళాశాలలో ఈ నెల 17న క్యాంపస్ సెలక్షన్లు నిర్వహించనున్నట్టు సీఆర్ఆర్ విద్యా సంస్థల కార్యదర్శి ఎంబీఎస్‌వీ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, విశాఖపట్నం విభాగాలకు చెందిన లారస్ లాబ్స్ ఆధ్వర్యంలో బీఎస్సీ (కెమిస్ట్రీ), ఎమ్మెస్సీ (ఆర్గానిక్ / జనరల్ / ఎనలైటికల్ / ఫార్మసుటికల్ / కెమిస్ట్రీ, బీఫార్మసీ, ఎంఫార్మసీ, ఎలక్ట్రికల్, మెకానికల్ విభాగాల్లో) డిప్లమా చేసిన విద్యార్థులకు పీజీ కళాశాల సెమినార్ హాల్‌లో ఉదయం 9.30 గంటలకు క్యాంపస్ సెలక్షన్లు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నెంబర్లు 91009 34943, 95053 40399, 99517 59789లో సంప్రదించవచ్చన్నారు.

నీటి వినియోగంలో బాధ్యతగా మెలగాలి

దెందులూరు: ఏలూరు నగర ప్రజలు నీటి వినియోగంలో బాధ్యతగా మెలగాలని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఏలూరు మల్కాపురంలోని సమ్మర్ స్టోరేజీ ట్యాంకును మంగళవారం పరిశీలించిన ఆయన నీటిని వృథా చేయొద్దని ప్రజలకు సూచించారు. భవిష్యత్తులో తాగునీటి అవసరాలకు ఇబ్బంది ఉండకూడదని 17 మోటార్లతో సమ్మర్ స్టోరేజీ ట్యాంకును నింపే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. ఆయన వెంట ఇరిగేషన్ ఎస్ఈ నాగార్జునరావు, కమిషనర్ ఎ.భానుప్రతాప్ పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

భీమడోలు: బడిఈడు పిల్లలను ప్రభుత్వ ప్రభుత్వ బడుల్లో చేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయుల దేనని భీమడోలు ఎంఈఓ ఈదుపల్లి శ్రీనివాసరావు అన్నారు. సూరప్పగూడెం పంచాయతీ పరిధిలోని పాతూరు పాఠశాలను మంగళవారం ఆయన పరిశీలించారు. రికార్డులు, రిజిస్టర్లు ఆయన పరిశీలించారు. విద్యార్థులు విద్యా సామర్థ్యాలను ఆయన పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని ఆయన రుచి చూసి సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం హెచ్ఎం నిర్మలకుమారి, టీచర్ మండే సుధాకర్‌లతో కలిసి ఆయన ప్రత్యేక బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు, అంగన్‌వాడీ చిన్నారులు, టీచర్లు, ర్యాలీ చేశారు. ఐదేళ్లు నిండిన చిన్నారుల ఇంటింటికీ వెళ్లి వారు బడిలో చేరాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సామాన్యుడిపై వంట గ్యాస్ భారం

- వంటగ్యాస్ సిలిండర్‌పై రూ.50 అదనపు భారం
- పేదలకు గుదిబండగా మారిన గ్యాస్ సిలిండర్
- డివిజన్‌లో రూ.2.32 కోట్లకు పైగా వడ్డన



గ్యాస్ బండలు

దెందులూరు: సామాన్యుడి వంటింట్లో కూటమి ప్రభుత్వం మళ్లీ మంట పెట్టింది. కొన్ని రోజులగా వాణిజ్య సిలిండర్ ధరలను పెంచుతూ వస్తున్న ప్రభుత్వం తాజాగా గృహ వినియోగదారులకు వాత పెట్టింది. పేద, సామాన్య కుటుంబాలకు గ్యాస్ ధర గుదిబండగా మారింది. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న సామాన్యుడిపై మరో భారం పడింది. కేంద్ర ప్రభుత్వం పేద, సామాన్య కుటుంబాల్లో గ్యాస్ మంటలు రేపింది. గృహ వినియోగ సిలిండర్ ధర రూ.840 ఉండగా తాజాగా కేంద్రం మరో రూ.50 పెంచింది. దీంతో పేదవర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతుంది. ఉజ్వల పథకం లబ్ధిదారులను సైతం ప్రభుత్వం కనికరించలేదు. వారికి కూడా ఈ పెంపు వర్తింపు జేయడం గమనార్హం. ఇకపై ప్రతి 15 రోజులకు లేదా నెలకోసారి ధరలపై సమీక్షిస్తామని ప్రకటించడంతో భవిష్యత్తులో గ్యాస్ ధర మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయనే సంకేతాలు ఇచ్చినట్టైంది.

రూ.2.32 కోట్లకు పైగా భారం

గ్యాస్ సిలిండర్ ధర పెంపుతో ఏలూరు డివిజన్ వ్యాప్తంగా వినియోగదారులపై నెలకు రూ.2.32 కోట్ల మేర అదనపు భారం పడనుంది. డివిజన్ పరిధిలో పలు గ్యాస్ ఏజెన్సీల పరిధిలో మొత్తం 1.94 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉండగా అందులో 4600 వరకు వాణిజ్యపరమైనవి. మిగిలిన 1.89 లక్షల కనెక్షన్లకు ఈ పెంపు వర్తించనుంది. ప్రస్తుతం గృహ వినియోగానికి సంబంధించిన 14.2 కేజీల గ్యాస్ సిలిండర్ ధర రూ.840 ఉండగా ఇకపై రూ.890 కానుంది. నిబంధనలకు విరుద్ధంగా రవాణా చార్జీల పేరుతో వసూలు చేస్తున్న మొత్తం అదనం. దీంతో సిలిండర్‌కు కనీసం రూ.920 సమర్పించుకోవాలి.

ధరల పెంపుతో తప్పని తిప్పలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలను పెంచడంతో పేద, మధ్య తరగతి ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. ఒక వైపు కూరగాయల ధరలు భగ్గుమంటూ ఆకాశాన్నంటుతున్నాయి. మరోవైపు వంట గ్యాస్ సిలిండర్ ధర పెరగడం చాలా బాధకరం. ప్రభుత్వాలు సంబంధించి ధరలను అదపు చేసి పేదలను ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

గ్యాస్ ధర తగ్గించాలి



సామాన్యులపై ప్రభుత్వం ఇప్పటికే కరెంటు చార్జీలతో పాటు అనేక భారాలు మోపింది. డీజిల్, పెట్రోల్ ధరలు పెరగడం నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడానికి కారణమైంది. ఈ పరిస్థితుల్లో పేదవాళ్లు బతకడమే కష్టంగా ఉంది. ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఇలా ధరలు పెంచుకుంటూ పోవడం సమంజసం కాదు.

– ప్రసన్న, వార్డు మెంబర్, అలుగులగూడెం

సామాన్యుడిపై తీవ్ర ప్రభావం



వంట గ్యాస్ సిలిండర్ ధర పెంపు సామాన్య ప్రజలకు భారం. ఇప్పటికే కొనలేని స్థితిలో ఉన్న గ్యాస్ సిలిండర్ ధర మరింత పెరగడం ఆవేదన కలిగిస్తోంది. సగటున ఒక్కో కుటుంబం ఏడాదికి ఆరు సిలిండర్లు కొనుగోలు చేస్తుంది. ప్రభుత్వాల నిర్ణయం వల్ల పేదలు అదనపు భారం మోయాల్సి వస్తోంది. సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి గ్యాస్ సిలిండర్, నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించాలి.

– కృష్ణవేణి, వార్డుమెంబర్, దెందులూరు

ఆప్కాస్ విధి విధానాలు ప్రకటించాలి



సమావేశంలో పాల్గొన్న ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు

ఏలూరు (టూటౌన్): ఆప్కాస్‌పై విధి విధానాలను ప్రకటించాలని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు రెడ్డి డాంగే, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఏలూరు జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యలగాడ శివకుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు నగర సమితి ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. కొన్ని నెలల క్రితం ఆప్కాస్ రద్దు చేస్తున్నట్టు మంత్రి వర్గం తెలపడంతో అసెంబ్లీ సమావేశాల సందర్భంగా గత నెల 11న విజయవాడలో మున్సిపల్ కార్మికులు మహా ధర్నా చేశారని తెలిపారు. ఈ తరుణంలో అసెంబ్లీ సమావేశంలో ఆప్కాస్ పై మంత్రివర్గ ఉప సంఘం వేశామని ముఖ్యమంత్రి ప్రకటించారని, ఆ సంఘం ఏం నిర్ణయిస్తుందో తెలియక ముందే ఆప్కాస్ రద్దు అవుతున్నట్టు వదంతులు వ్యాపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అపరిష్కృతంగా ఉన్న ఇంజినీరింగ్ కార్మికుల వేతనాల పెంపునకు గత సమ్మె నాటి ప్రభుత్వ ఒప్పందాన్ని తక్షణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ సిబ్బందికి సంక్షేమ పథకాలు వర్తించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో యూనియన్ ఏలూరు నగర సమితి సభ్యులు ఇంటి అశోక్, కాకాని సుబ్బారావు, ఎ.ప్రసాద్, పెదారి వంశీ, అల్లం పెద్దిరాజు, పొన్నాడ మల్లేశ్వరరావు, మాడుగుల జగదీష్, అంత రాజ్ లీల, ప్రసాద్, ఎస్ సతీష్, బంగారు లోకేష్, తంగిల ఉమా తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణ సేవలు ప్రశంసనీయం



రామకృష్ణను సన్మానిస్తున్న వైఎంహెచ్ఏ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన హిందూ యువజన సంఘ (వైఎంహెచ్ఏ) సభ్యుడు, ప్రముఖ సాంఘిక నాటిక రచయిత, దర్శకుడు, నటుడు పెదపాటి రామకృష్ణ కళారంగానికి చేస్తున్న సేవలు ప్రశంసనీయమని హిందూ యువజన సంఘం ప్రతినిధులు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కందుకూరి వీరేశలింగం విశిష్ట పురస్కారాన్ని ఈ ఏడాదికి రామకృష్ణకు ప్రకటించడంతో మంగళవారం స్థానిక వైఎంహెచ్ఏ హాలులో ఆయన్ని వైఎంహెచ్ఏ మేనేజ్మెంట్ కమిటీ అధ్యక్షులు యర్రా సోమలింగేశ్వర రావు, ప్రధాన కార్యదర్శి కేవీ సత్యనారాయణ, కోశాధికారి కానాల బాల రమేష్, ఉపాధ్యక్షులు యిరదల ముద్దుకృష్ణ, జాయింట్ సెక్రెటరీ సీహెచ్ సాయి తేజ, ఎగ్జిక్యూటివ్ కమిటీ ప్రెసిడెంట్ జవ్వాజి మోహన్ విఠల్, కార్యదర్శి మజ్జి సూర్యకాంతరావు సహాయ కార్యదర్శి కేవీ రావు ఘనంగా సత్కరించారు. ఏలూరులో ఎన్నో సాంఘిక నాటిక, నాటకాలు ప్రదర్శించడమే కాకుండా హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా, వైఎంహెచ్ఏ సభ్యుడిగా కళారంగానికి ఎంతోసేవ చేస్తున్న రామకృష్ణకు వీరేశలింగం విశిష్ట పురస్కారం రావటం ఏలూరుకి గర్వకారణం అన్నారు.

డిగ్రీ కాలేజీ ప్రవేశాల ప్రకటన

గణపవరం: స్థానిక శ్రీచింతలపాటి వరప్రసాదమూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో పలు కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీలో గ్రూపులు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు ఇంటర్‌లో పొందిన మార్కుల ఆధారంగా గ్రూపును ఎంపిక చేసుకోవచ్చని ఆమె సూచించారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గణపవరం: మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తాడేపల్లిగూడెం ఐసీడీఎస్ సీడీపీవో ఓ ప్రకటనలో తెలిపారు. గణపవరం మండలం కొత్తపల్లి (ఓసీ), కోమర్రు-2 (ఓసీ) గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, మొయ్యేరు-1 (బీసీ-ఇ) గణపవరం-3 (ఓసీ), గణపవరం-9(బీసీ-డీ), కొత్తపల్లి (ఎస్సీ) అంగన్‌వాడీ ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. స్థానిక మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. వయస్సు 1 జూలై 25 నాటికి 21 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాల లోపు లోపు ఉండాలి. కనీస విద్యార్హత పదో తరగతి పాసై ఉండాలి. ఈ నెల 22వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు తగిన ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తులను తాడేపల్లిగూడెంలోని పత్తిపాడు ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	28
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	30
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	38
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	19
ఏలూరు - తిరుపతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	27
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	27
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	27
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	21
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	30
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	30
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	31
ఏలూరు - తిరుపతి	16.00	4830	31

ఆకట్టుకున్న అగ్నిమాపక విన్యాసాలు



ఫోమ్ సాయంతో మంటలను అదుపు చేసే విధానాన్ని చూపిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



జెడ్ పరికరంతో సిబ్బంది విన్యాసం

భీమడోలు: జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం అగ్ని ప్రమాదాల నివారణ, నియంత్రణలపై భీమడోలు జంక్షన్ వద్ద సిబ్బంది నిర్వహించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. భీమడోలు అగ్నిమాపక కేంద్రం అధికారి జి.నాగరాజు ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది కరపత్రాలను పంపిణీ చేసి, అవగాహన కల్పించారు. తొలుత భీమడోలు జంక్షన్ వద్ద అగ్నిమాపక రథం ఉంచి అక్కడ పలు విన్యాసాలు చేశారు. అగ్ని ప్రమాదంలో మంటలను అదుపు చే యడం, రసాయనాలు, ఆయిల్ ట్యాంకర్లు ఫ్యాకరీల్లో జరిగే పెను ప్రమాదాలను ఫోమ్‌తో అరికట్టడంపై ప్రదర్శనలు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. మంట తక్కువ, పొగ ఎక్కువగా ఉన్న సమయంలో రివాల్వింగ్ పరికరంతో, ఎత్తైన ప్రదేశంలో అగ్ని ప్రమాదాలు అదుపు చేసే జెడ్ విన్యాసాలను ప్రదర్శించారు. అనంతరం ఫైర్ అధికారి జి.నాగరాజు మాట్లాడుతూ వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటాయని, అప్రమత్తతతో మెలగాలన్నారు. మన భద్రత మన చేతుల్లో ఉంటుందని తెలిపారు.